30-11-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - మీరు ఆత్మిక మార్గదర్శకులుగా అయి యాత్రను చేయాలి మరియు చేయించాలి, స్మృతియే మీ యాత్ర, స్మృతి చేస్తూ ఉన్నట్లయితే సంతోషపు పాదరసము పైకి ఎక్కుతుంది"

ప్రశ్న:- నిరాకార లోకములోకి వెళ్ళడంతోనే ఏ సంస్కారాలు సమాప్తమైపోతాయి మరియు ఏ సంస్కారాలు మిగిలి ఉంటాయి?

జవాబు:- అక్కడ జ్ఞానము యొక్క సంస్కారాలు సమాప్తమైపోతాయి, ప్రారబ్ధపు సంస్కారాలు మిగిలి ఉంటాయి. ఆ సంస్కారాల ఆధారముగా పిల్లలైన మీరు సత్యయుగములో ప్రారబ్ధాన్ని అనుభవిస్తారు, అక్కడ మళ్ళీ చదువు లేక పురుషార్థపు సంస్కారాలు ఉండవు. ప్రారబ్ధము లభించగానే ఇక జ్ఞానం సమాప్తమైపోతుంది.

పాట:- రాత్రి ప్రయాణీకుడా, అలసిపోకు... (రాత్ కే రాహీ థక్ మత్ జానా...)

ఓం శాంతి. ఇక్కడ సమ్ముఖముగా శివ భగవానువాచ ఉంది. గీతలో శ్రీకృష్ణ భగవానువాచ అని చూపిస్తారు కానీ శ్రీకృష్ణుడు ఆ నామ-రూపాలతో సమ్ముఖముగా ఉండలేరు. ఇక్కడైతే నిరాకార శివ భగవానువాచ అని సమ్ముఖముగా అంటారు. శ్రీకృష్ణ ఉవాచ అని అన్నట్లయితే, మరి వారు సాకారుడైపోతారు. ఎవరైతే వేద-శాస్త్రాలు మొదలైనవి వినిపిస్తారో, వారు భగవానువాచ అని అనరు, ఎందుకంటే ఆ సాధు-సన్యాసులు, మహాత్ములు మొదలైనవారంతా సాకారములో ఉన్నారు. ఇక్కడ తండ్రి - ఓ ఆత్మిక యాత్రికులారా అని అంటారు. ఆత్మిక తండ్రి తప్పకుండా ఆత్మలతోనే - పిల్లలూ, అలసిపోకండి అని అంటారు. యాత్రలో ఎవరైనా అలసిపోతే తిరిగి వచ్చేస్తారు. అది దైహికమైన యాత్ర. భిన్న-భిన్న మందిరాలకు దైహిక తీర్థ యాత్రలు చేయడానికి వెళ్తారు. కొందరు శివుని మందిరాలకు వెళ్తారు, అక్కడ అన్నీ భక్తి మార్గపు దైహిక చిత్రాలను ఉంచారు. ఇక్కడైతే ఉన్నతోన్నత ఆత్మయైన పరమపిత పరమాత్మ ఆత్మలకు చెప్తున్నారు - ఓ పిల్లలూ, ఇప్పుడు నా ఒక్కరితోనే బుద్ధియోగాన్ని జోడించండి, అంతేకాక వారు జ్ఞానాన్ని కూడా ఇస్తారు. తీర్థ యాత్రలకు వెళ్ళినప్పుడు అక్కడ కూడా బ్రాహ్మణులు కూర్చొని ఉంటారు, కథలు-కీర్తనలు చేస్తూ ఉంటారు. నరుని నుండి నారాయణునిగా అయ్యేందుకు మీ సత్యనారాయణ కథ ఒక్కటే ఉంది. మొదట మధురమైన ఇంటికి వెళ్తాము, ఆ తర్వాత విష్ణుపురిలోకి వస్తాము అని మీకు తెలుసు. ఈ సమయంలో మీరు బ్రహ్మపురిలో ఉన్నారు, దీనిని పుట్టినిల్లు అని అంటారు. మీకు నగలు మొదలైనవేవీ లేవు ఎందుకంటే మీరు పుట్టినింటిలో ఉన్నారు. అత్తవారింటిలో మీకు అపారమైన సుఖాలు లభించనున్నాయని మీకు తెలుసు. ఇక్కడ కలియుగ అత్తవారింటిలో అపారమైన దుఃఖము ఉంది. మీరు ఆవలివైపు ఉన్న సుఖధామములోకి వెళ్ళాలి. ఇక్కడి నుండి ట్రాన్స్ఫర్ అవ్వాలి. తండ్రి అందరినీ నయనాలపై కూర్చోబెట్టుకొని తీసుకువెళ్తారు. శ్రీకృష్ణుని తండ్రి అతడిని బుట్టలో కూర్చోబెట్టుకొని ఆవలివైపుకు తీసుకొని వెళ్ళినట్లుగా చూపిస్తారు కదా, అలానే ఈ అనంతమైన తండ్రి పిల్లలైన మిమ్మల్ని అటువైపు ఉన్న మెట్టినింటికి తీసుకువెళ్తారు. మొదట మన నిరాకారీ ఇంటికి తీసుకువెళ్తారు, ఆ తర్వాత మెట్టినింటికి పంపిస్తారు. అక్కడ ఈ పుట్టినింటి, మెట్టినింటి విషయాలను మర్చిపోతారు. అది నిరాకారీ పుట్టినిల్లు, అక్కడ ఈ జ్ఞానాన్ని మర్చిపోతారు, జ్ఞాన సంస్కారాలు తొలగిపోతాయి, ఇకపోతే ప్రారబ్ధపు సంస్కారాలు మిగిలి ఉంటాయి. అప్పుడిక పిల్లలైన మీకు ప్రారబ్ధమే ధ్యానములో ఉంటుంది. ప్రారబ్ధము అనుసారంగా వెళ్ళి సుఖము యొక్క జన్మలను తీసుకుంటారు. సుఖధామానికి వెళ్ళాలి. ప్రారబ్ధము లభించిన తర్వాత ఇక జ్ఞానం సమాప్తమైపోతుంది. ప్రారబ్ధములో మళ్ళీ మనది అదే పాత్ర కొనసాగుతుంది. మీ సంస్కారాలే ప్రారబ్ధానికి చెందినవిగా అవుతాయి. ఇప్పుడు పురుషార్థ సంస్కారాలు ఉన్నాయి. పురుషార్థము మరియు ప్రారబ్ధము, రెండు సంస్కారాలూ అక్కడ ఉంటాయని కాదు, అలా కాదు, అక్కడ ఈ జ్ఞానం ఉండదు. కావున ఇది మీ ఆత్మిక యాత్ర, మీ ముఖ్యమైన మార్గదర్శకుడు తండ్రి. ఆ మాటకొస్తే మీరు కూడా ఆత్మిక మార్గదర్శకులుగా అవుతారు, అందరినీ మీతో పాటు తీసుకొని వెళ్తారు. వారు దైహికమైన మార్గదర్శకులు, మీరు ఆత్మిక మార్గదర్శకులు. వారు అమరనాథ్ కు చాలా వైభవంగా వెళ్తారు, గుంపులు-గుంపులుగా విశేషముగా అమరనాథ్ కు ఎంతో వైభవంగా వెళ్తారు. ఎంతమంది సాధు-సన్యాసులు బాజా-భజంత్రీలు తీసుకువెళ్తారు అనేది బాబా చూసారు. తమతో పాటు డాక్టర్ మొదలైనవారిని కూడా తీసుకువెళ్తారు ఎందుకంటే చలి బాగా ఉంటుంది. కొందరు అనారోగ్యం పాలవుతారు. మీ యాత్ర అయితే చాలా సహజము. స్మృతిలో ఉండడమే మీ యాత్ర అని తండ్రి అంటారు. స్మృతి ముఖ్యమైనది. పిల్లలు స్మృతి చేస్తూ ఉన్నట్లయితే సంతోషపు పాదరసము పైకెక్కి ఉంటుంది. మీతో

పాటు ఇతరులను కూడా యాత్రకు తీసుకువెళ్ళాలి. ఈ యాత్ర ఒకేసారి జరుగుతుంది. ఆ దైహికమైన యాత్రలైతే భక్తి మార్గం నుండి ప్రారంభమవుతాయి. అవి కూడా ప్రారంభంలోనే ఉండేవి కావు. వెంటనే మందిరాలు, చిత్రాలు మొదలైనవి తయారవుతాయని కాదు, అవన్నీ మెల్లమెల్లగా తర్వాత తయారవుతూ ఉంటాయి. మొట్టమొదట శివుని మందిరము తయారవుతుంది. వారు కూడా మొదట ఇంట్లో సోమనాథుని మందిరాన్ని తయారుచేస్తారు, అప్పుడిక ఎక్కడికీ వెళ్ళవలసిన అవసరము ఉండదు. ఈ మందిరాలు మొదలైనవన్నీ తర్వాత తయారవుతాయి, సమయం పడుతుంది. మెల్లమెల్లగా కొత్త శాస్త్రాలు, కొత్త చిత్రాలు, కొత్త మందిరాలు మొదలైనవి తయారవుతూ ఉంటాయి, అందుకు సమయం పడుతుంది ఎందుకంటే అవి చదివేవారు కూడా కావాలి కదా. మఠాలు మొదలైనవి ఎప్పుడైతే వృద్ధి చెందుతాయో, అప్పుడు శాస్త్రాలు తయారుచేయాలి అన్న ఆలోచన కలుగుతుంది. ఇన్ని తీర్థ స్థానాలు తయారయ్యాయి, మందిరాలు తయారయ్యాయి, చిత్రాలు తయారయ్యాయి, సమయం పడుతుంది కదా. భక్తి మార్గం ద్వాపరము నుండి ప్రారంభమవుతుంది అని అంటారు కానీ అందుకు సమయమైతే పడుతుంది కదా, ఆ తర్వాత కళలు తగ్గిపోతూ ఉంటాయి. మొదట అవ్యభిచారి భక్తి ఉంటుంది, ఆ తర్వాత వ్యభిచారి భక్తిగా అయిపోతుంది. ఈ విషయాలన్నీ మంచి రీతిలో చిత్రాలపై నిరూపించి చెప్పబడతాయి. అర్థం చేయించేవారికి - ఈ-ఈ విధంగా చిత్రాలను తయారుచేయాలి, ఈ విధంగా అర్థం చేయించాలి అని బుద్ధిలో తిరుగుతూ ఉంటుంది. అందరి బుద్ధిలోనూ ఇలా నడవదు. నంబరువారు ఉన్నారు కదా. కొందరి బుద్ధి అసలు ఏమాత్రమూ నడవదు, కావున వారు పదవి కూడా అటువంటిదే పొందుతారు. ఫలానావారు ఏమి అవుతారు - అన్నది తెలిసిపోతుంది. ఎంతగా ముందుకు వెళ్తూ ఉంటారో, అంతగా మీరు అర్థం చేసుకుంటూ ఉంటారు. ఎప్పుడైతే యుద్ధాలు మొదలైనవి జరుగుతాయో, అప్పుడు మీరు ప్రత్యక్షముగా చూస్తారు, అప్పుడు ఎంతగానో పశ్చాత్తాప పడతారు. ఆ సమయంలో చదువు కొనసాగదు. యుద్ధాల సమయంలో ఆర్తనాదాలు జరుగుతూ ఉంటాయి, వినలేరు, ఏం జరుగుతుందో తెలియదు. పార్టిషన్ జరిగినప్పుడు ఏమయ్యిందో చూసారు కదా. ఈ వినాశన సమయం చాలా కఠినమైనది. అయితే, సాక్షాత్కారాలు మొదలైనవి ఎన్నో జరుగుతాయి, తద్వారా వీరు ఎంత చదివారు అన్నది తెలిసిపోతుంది. ఎంతగానో పశ్చాత్తాప పడతారు కూడా. చూడండి, మీరు చదువును వదిలేసారు, అందుకే ఈ పరిస్థితి ఏర్పడింది అని సాక్షాత్కారాలు జరుగుతాయి. ధర్మరాజు సాక్షాత్కారాలు చేయించకుండా శిక్షలు ఎలా ఇస్తారు? అంతా సాక్షాత్కారం చేయిస్తారు. ఇక ఆ సమయంలో ఏమీ చేయలేరు. అయ్యో నా భాగ్యము అని అంటారు. పురుషార్థ సమయమైతే గతించిపోయింది. మరి పురుషార్థము ఇప్పుడే ఎందుకు చేయరు? అని తండ్రి అడుగుతారు. సేవ ద్వారానే హృదయం పైకి ఎక్కుతారు. ఈ పిల్లలు మంచి సేవ చేస్తున్నారు అని తండ్రి అంటారు. మిలట్రీవారు ఎవరైనా మరణిస్తే వారి మిత్ర-సంబంధీకులు మొదలైనవారికి కూడా అవార్డు ఇస్తారు. ఇక్కడ మీకు అవార్డు ఇచ్చేవారు అనంతమైన తండ్రి. తండ్రి నుండి భవిష్య 21 జన్మల కొరకు అవార్డు లభిస్తుంది. ప్రతి ఒక్కరూ తమ హృదయంపై చేయి వేసుకొని స్వయాన్ని ప్రశ్నించుకోవాలి - నేను ఎంత చదువుకుంటున్నాను. ధారణ జరగడం లేదంటే భాగ్యములో లేనట్లే. కర్మలే ఆ విధముగా ఉన్నాయి అని అంటారు. చాలా చెడు కర్మలు చేసేవారు ఏమీ ధారణ చేయలేరు.

తండ్రి అర్థం చేయిస్తారు - మధురమైన పిల్లలూ, మీరు ఈ ఆత్మిక యాత్రలో మీ తోటివారిని కూడా తీసుకువెళ్ళాలి. ప్రతి ఒక్కరికీ ఈ యాత్ర విషయాన్ని తెలియజేయడం మీ కర్తవ్యము. ఇది మా ఆత్మిక యాత్ర అని చెప్పండి. అది దైహికమైన యాత్ర. రంగూన్ వైపు ఒక మాయా సరస్సు ఉంది అన్నట్లు చూపిస్తారు, అక్కడ స్నానం చేసినట్లయితే దేవకన్యలుగా అవుతారు అని అంటారు, కానీ అలా దేవకన్యలుగా ఎవ్వరూ అవ్వరు. ఇది జ్ఞాన స్నానం చేసే విషయము, దీని ద్వారా మీరు స్వర్గపు మహారాణిగా అవుతారు మరియు జ్ఞాన-యోగాల బలముతో వైకుంఠములోకి రావడం, వెళ్ళడం అనేది మీకు సామాన్యమైన విషయము. ఇక్కడైతే మిమ్మల్ని - ఘడియ, ఘడియ ధ్యానములోకి వెళ్ళకండి, అది అలవాటైపోతుంది అని ఆపడం జరుగుతుంది. కావున ఇది జ్ఞాన మానస సరోవరము. పరమపిత పరమాత్మ వచ్చి ఈ మనుష్య తనువు ద్వారా జ్ఞానాన్ని వినిపిస్తారు, అందుకే దీనిని మానస సరోవరము అని అంటారు. మానస సరోవరము అన్న పదము సాగరము నుండి వెలువడుతుంది. జ్ఞాన సాగరములో జ్ఞాన స్నానం చేయడం చాలా మంచిది. స్వర్గములో మహారాణి అని పిలువబడతారు. మీరు కూడా స్వర్గానికి యజమానులుగా అవ్వండి అని తండ్రి అంటారు. పిల్లలపై ప్రేమ ఉంటుంది. ప్రతి ఒక్కరిపై దయ కలుగుతుంది, సాధువులపై కూడా దయ కలుగుతుంది. సాధువులను కూడా ఉద్ధరిస్తారు అని గీతలో రాయబడి ఉంది. జ్ఞాన-యోగాల ద్వారా ఉద్ధరిస్తారు. పిల్లలైన మీలో అర్థం చేయించే చురుకుదనం ఎంతో ఉండాలి. మీకు మిగిలినవన్నీ తెలుసు, కానీ అదంతా మజ్జిగ మాత్రమే, ఇకపోతే వెన్నను తినిపించేవారి గురించి మీకు తెలియనే తెలియదు అని చెప్పండి. తండ్రి ఎంత బాగా అర్థం చేయిస్తారు, కానీ ఎవరి బుద్ధిలోనైనా కూర్చోవాలి కదా. తండ్రిని తెలుసుకోవడం ద్వారా మనుష్యులు వజ్రతుల్యముగా అవుతారు,

తెలుసుకోకపోవడం వలన మనుష్యులు గవ్వతుల్యముగా, పూర్తిగా పతితులుగా ఉన్నారు. తండ్రిని తెలుసుకోవడం ద్వారానే పావనముగా అవుతారు. పతిత ప్రపంచములో పావనులు ఎవ్వరూ ఉండరు. కావున మహారథి పిల్లలు ఎవరైతే ఉన్నారో, వారు బాగా అర్థం చేయించగలుగుతారు. ఎంతమంది బ్రహ్మాకుమార-కుమారీలు ఉన్నారు. ప్రజాపిత బ్రహ్మా అన్న పేరు కూడా ప్రసిద్ధమైనది. మీరు ప్రజాపిత బ్రహ్మా యొక్క ముఖవంశావళి. బ్రహ్మాకే 100 భుజాలు, 1000 భుజాలు చూపిస్తారు. ఇన్ని భుజాలైతే ఉండవని కూడా అర్థం చేయించడం జరుగుతుంది. ఇకపోతే బ్రహ్మా అయితే ఎంతోమంది పిల్లలు కలవారు. మరి బ్రహ్మా ఎవరి సంతానము? వీరికైతే తండ్రి ఉన్నారు కదా. బ్రహ్మా శివబాబాకు బిడ్డ, వీరికి ఇంకే తండ్రి ఉండగలరు? మనుష్యమాత్రులు ఎవ్వరూ ఉండరు. బ్రహ్మా, విష్ణు, శంకరులు సూక్ష్మవతన వాసులుగా మహిమ చేయబడతారు. వారైతే ఇక్కడకు రాలేరు. ప్రజాపిత బ్రహ్మా అయితే తప్పకుండా ఇక్కడే ఉంటారు కదా. సూక్ష్మవతనములోనైతే ప్రజలను రచించరు. కావున పరమపిత పరమాత్మ వచ్చి ఈ బ్రహ్మాముఖము ద్వారా శక్తిసేనను రచిస్తారు. మొట్టమొదట మేము బ్రహ్మా ముఖవంశావళి అని పరిచయాన్ని ఇవ్వాలి. మీరు కూడా బ్రహ్మా పిల్లలే కదా. ప్రజాపిత బ్రహ్మ అందరికీ తండ్రి. తర్వాత వారి నుండి ఇతర వంశావళులు వెలువడుతాయి, పేర్లు మారుతూ ఉంటాయి. ఇప్పుడు మీరు బ్రాహ్మణులు. ప్రజాపిత బ్రహ్మాకు ఎంతమంది పిల్లలు ఉన్నారో ప్రత్యక్షముగా చూడండి. తప్పకుండా పిల్లలకు వారసత్వము లభిస్తుంది. బ్రహ్మా వద్దనైతే ఆస్తి ఏమీ లేదు, ఆస్తి శివబాబా వద్దే ఉంది. బ్రహ్మా శివుని కుమారుడు. అనంతమైన తండ్రి నుండే వారసత్వము లభిస్తుంది. బ్రహ్మా ద్వారా శివబాబా కూర్చొని చదివిస్తారు. మనకు తాతగారి వారసత్వము లభిస్తుంది. బాబా ఎంతో అర్థం చేయిస్తారు, కానీ యోగము లేదు. నియమానుసారముగా నడవకపోతే బాబా కూడా ఏమి చేయగలరు? ఇక అది వారి భాగ్యము అని తండ్రి అంటారు. ఈ పరిస్థితిలో మీకు ఏ పదవి లభిస్తుంది అనేది బాబాను అడిగితే బాబా చెప్పగలరు. నేను ఎంత సేవను చేస్తున్నాను, శ్రీమతముపై ఎంతవరకు నడుస్తున్నాను? అని తమ హృదయం కూడా సాక్ష్యం చెప్తుంది. శ్రీమతము - మన్మనాభవ అని చెప్తుంది. అందరికీ తండ్రి మరియు వారసత్వము యొక్క పరిచయాన్ని ఇస్తూ ఉంటారు, దండోరాను కూడా వేయిస్తూ ఉంటారు. మీరు ప్రభుత్వానికి కూడా అర్థం చేయించాలి అని బాబా సూచన ఇస్తూ ఉంటారు, తద్వారా తప్పకుండా భారత్ యొక్క శక్తి అంతా పోయింది అని వారు కూడా అర్థం చేసుకోవాలి. పరమపిత పరమాత్మ అయిన సర్వశక్తివంతునితో యోగమే లేదు. వారితో మీరు యోగాన్ని జోడించినట్లయితే పూర్తిగా విశ్వానికి యజమానులుగా అవుతారు, మాయపై కూడా మీరు విజయాన్ని పొందుతారు. గృహస్థ వ్యవహారములో ఉంటూ మాయపై విజయం పొందాలి. మన సహాయకుడు తండ్రి. ఎంతగా అర్థం చేయించడం జరుగుతుంది, ధారణ చేయాలి. ధనాన్ని ఇచ్చినా ధనము తరగదు అని బాబా అర్థం చేయించారు. సేవ చేసినప్పుడే బాబా హృదయం పైకి ఎక్కగలరు, లేదంటే అది అసంభవము. దీని అర్థం బాబా ప్రేమించరని కాదు. బాబా సర్వీసబుల్ గా ఉన్న వారిని ప్రేమిస్తారు. కష్టపడాలి. అందరినీ ఈ యాత్రకు యోగ్యులుగా తయారుచేస్తారు. మన్మనాభవ. ఇది ఆత్మిక యాత్ర, నన్ను స్మృతి చేసినట్లయితే మీరు నా వద్దకు చేరుకుంటారు. శివపురిలోకి వచ్చి ఆ తర్వాత విష్ణుపురిలోకి వెళ్ళిపోతారు. ఈ విషయాల గురించి కేవలం పిల్లలైన మీకే తెలుసు. ఇంకెవ్వరికీ మన్మనాభవ అర్థము తెలియదు. చదవడమైతే ఎంతో చదువుతారు. తండ్రి మహామంత్రాన్ని ఇస్తారు, నన్ను స్మృతి చేసినట్లయితే మీరు వికర్మాజీతులుగా అయిపోతారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. జ్ఞాన స్నానం చేయాలి. ప్రేమతో సేవ చేసి తండ్రి హృదయ సింహాసనముపై కూర్చోవాలి. పురుషార్థ సమయంలో నిర్లక్ష్యులుగా అవ్వకూడదు.

2. తండ్రి కనురెప్పలపై కూర్చొని కలియుగ దుఃఖధామము నుండి సుఖధామములోకి వెళ్ళాలి, అందుకే తమ సర్వస్వాన్ని ట్రాన్స్ఫర్ చేసుకోవాలి.

వరదానము:- జీవితములో దివ్య గుణాలు అనే పుష్పాల యొక్క పూలతోట ద్వారా సంతోషపు సంపన్నతను అనుభవము చేసే ఎవర్ హ్యాపీ భవ

సదా సంతోషముగా ఉండటము అనగా నిండుతనము, సంపన్నత. మొదట జీవితము ముళ్ళ అడవిలో ఉండేది, ఇప్పుడు పుష్పాల యొక్క సంతోషములోకి వచ్చేసారు. జీవితములో సదా దివ్యగుణాలనే

పుష్పాలతో కూడిన పూలతోట ఉంది, అందుకే మీ సంపర్కములోకి ఎవరు వచ్చినా వారికి దివ్యగుణాలనే పుష్పాల సుగంధము వస్తూ ఉంటుంది మరియు ఆ సంతోషపు సంపన్నతను చూసి సంతోషిస్తారు, శక్తిని అనుభవము చేస్తారు. ఆ సంతోషపు సంపన్నత ఇతరులను కూడా శక్తిశాలిగా చేస్తుంది మరియు సంతోషములోకి తీసుకువస్తుంది, అందుకే మేము సదా సంతోషముగా ఉన్నాము అని మీరు అంటారు.

స్లోగన్:- ఎవరైతే మాయ యొక్క నీటిబుడగలకు భయపడేందుకు బదులుగా వాటితో ఆడుకుంటారో, వారే మాస్టర్ సర్వశక్తివంతులు.